కల్తీ.. కల్తీ..

- జోరుగా కల్తీ వస్తువుల అమ్మకాలు
- ప్యాకింగ్ చేసి యథేచ్ఛగా ..
- పొరుగు రాష్ట్రాల నుంచి కల్తీ సరుకులు
- సంచార వాహనాల్లో అమ్మకాలు
- పట్టించుకోని ఆహార కల్తీ నిరోధకశాఖ


పలమనేరు వారపుసంతలో నాసిరకం వస్తువుల అమ్మకాలు సాగిస్తున్న దృశ్యం (ఫైల్)

పలమనేరు: నియోజకవర్గంలో కల్తీ సరుకులు, రెండో రకం సరుకుల విక్రయాలు జోరందుకున్నాయి. పప్పులు, నూనెలు, మైదా, గోధుమపిండి, పోపు సామగ్రి ఇలా అన్ని రకాల ఆహార వస్తువులు నాణ్యత లేని రెండో రకం వస్తువుల అమ్మకాలు జోరందుకున్నాయి. వీటిని కొందరు ఏజెన్సీ నిర్వాహకులు స్వొంత ప్యాకింగ్‌లతో వారపుసంతలే లక్ష్యంగా సామాన్య జనానికి అంటగడుతున్నారు. సరిహద్దుల్లోని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కల్తీ సరుకులు ఇక్కడికి దిగుమతి అవుతున్నాయి. ఈ వస్తువుల్లో ఒకటో రకం, రెండో రకం అంటూ స్థానిక వ్యాపారులే ఏది అసలో, ఏది నకిలీనో కనుక్కోలేకపోతున్నారు. ఈ మధ్య సంచార వాహనాల్లో సరుకులను పెట్టుకుని దానికి మైక్ కట్టి గ్రామాల్లో తిరుగుతూ అమ్మకాలు చేస్తున్నారు. బియ్యం మొదలుకొని శనగ, కంది, పెసరపప్పు, చెక్కర, మైదాపిండి, గసాలు, రవ్వ, జీలకర్ర, మిరియాలు, చివరకు వంట నూనెల వరకు కల్తీ లేదా రెండో రకం తక్కువ క్వాలిటీ ఉన్న వస్తువులున్నాయి. మిరియాలలో బొప్పాయి గింజలు, గసగసాల్లో రవ్వ, మైదాలో చింతపిండి, నూనెల్లో పశువుల కొవ్వులను కలిపి కల్తీ చేస్తున్నారు. దీంతో కల్తీ వ్యాపారం వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. స్థానికంగా దుకాణాల్లో లభించే ప్రముఖ కంపెనీల నూనె ప్యాకెట్లు ఈ ప్రాంతంలోని వారపు సంతల్లో సైతం ఇదే కంపెనీల నకిలీలు లభ్యమవుతున్నాయి. పైగా ధరలో కూడా భారీ తేడా ఉండడంతో ప్రజలు ఎగబడి వీటినే కొనుగోలు చేస్తున్నారు. దుకాణాలకు ఇక్కడికి ప్రతి వస్తువుపై రూ.10 తేడా కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నాణ్యత లేని వస్తువులను తక్కువ ధరతో అమ్మి సులభంగా సొమ్ము చేసుకుంటున్నారు.

వారపుసంతల్లోనే నకిలీ విక్రయాలు ఎక్కువ..

ఇక్కడి వారపుసంతలో నాసిరకం, కల్తీ వస్తువుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రమాదకర కేసరి దాల్‌ను సైతం సంతల్లోనే ఎక్కువగా విక్రయిస్తున్నారు. ఎందుకంటే మధ్యతరగతి వాసులు ఎక్కువగా వారపుసంతలకే వస్తారు కాబట్టి ఇలాంటి వస్తువులను తక్కువ ధర పేరిట వారికి అంటగడుతున్నారు. ఆహారపదార్థాల కల్తీ, నాసిరకం వస్తువులు, సీల్ చేసిన ప్యాకెట్లలో కాకుండా ప్లాస్టిక్ కవర్లలో విక్రయాలు జరుగుతున్నాయి. తూకాల్లో తేడాలు, ఇన్నిరకాల తప్పులు సాగుతున్నా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. అప్పుడప్పుడూ రావడం, నామమాత్రపు తనిఖీలు చేసి వ్యాపారులిచ్చే మామూళ్లు తీసుకొని వెళ్లడం వీరికి మామూలుగా మారిందనే విమర్శలున్నాయి.

క్లుప్తంగా

35 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఎంఎస్ కంటి ఆస్పత్రి చెన్నై సహకారంతో ప్రముఖ వైద్యుడు డాక్టర్ అబ్బాస్ కంటిపరీక్షలు చేశారు. 14 మందిని శస్త్రచికిత్స కోసం గుర్తించి ఉచితంగా చేయిస్తామని చెప్పారు. అలాగే పదిమందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్

పలమనేరు: వినియోగదారుల హక్కులపై అవగాహ పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు సూచించారు. ఆమేరకు స్థానిక కళాశాలలో మండల న్యాయసేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది భాస్కర్ ఈ చట్టం గురించి వివరించారు. కామర్స్ విభాగాధిపతి చిదంబరం, అధ్యాపకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అగ్గిపెట్టెల లారీ బోల్తా


ప్రమాదానికి గురైన లారీ

కుప్పంరూరల్: అగ్గిపెట్టెల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన గురువారం వెలుగు చూసింది. వివరాలు.. కుప్పం సరిహద్దుల్లోని తమిళనాడు రాష్ట్రం చిన్నమటార్లపల్లి వద్ద గురువారం ఉదయం అగ్గిపెట్టెలను వేసుకుని తమిళనాడు రాష్ట్రం సేలం వెళ్తున్న ఓ లారీ మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అగ్గిపెట్టెలు రోడ్డుపై పడిపోగా, డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడినట్లు చెప్పారు. జాతీయ రహదారి కావడంతో తమిళ పోలీసులు అక్కడకు చేరుకుని లారీని పక్కకు తప్పించారు.

నోటీస్ బోర్డు

10న వారపు సంత వేలం

సదుం: సదుం పంచాయతీ వనరులకు ఈనెల 10న వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారపు, దినసరి సంత, బస్టాండు, జంతువధ శాల, పూల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు నిర్దేశించిన డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

8 నుంచి విగ్రహ ప్రతిష్టాపన

సదుం: మండలంలోని సజ్జలవారిపల్లెలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 8 నుంచి రెండు రోజుల పాటు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతుబజార్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా రైతుబజార్

పలమనేరు: పట్టణంలో నిర్మించిన రైతుబజార్‌ను ఈనెల 9న ప్రారంభించనున్నట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పరమేశ్వరన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. రైతులు, రైతు సంఘాలు, మహిళా గ్రూపు సభ్యులు ఇందులో వారు పండించిన పంట ఉత్పత్తులను విక్రయించుకోవచ్చునని తెలిపారు.

మహిళా దినోత్సవం రేపు

పలమనేరు: ఐద్వా ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఐద్వా పట్టణ కమిటీ సమావేశంలో జిల్లా కన్వీనర్ భువనేశ్వరి తెలిపారు.

కళామందిరంలో...

పట్టణ సమీపంలోని కళామందిరంలో రేపు మహిళా సదస్సు జరుగుతుందని స్థానిక సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తుల సీనాథంనాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 26 మంది మహిళలను ఈ సందర్భంగా సన్మానించనున్నట్టు అందులో ఆయన తెలిపారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: నూతన వధూవరులను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం ఉదయం ఆశీర్వదించారు. రొంపిచెర్ల మండలం పెద్దమల్లెలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత ప్రేమానందం మనవడు రోహిత్‌కు అన్నమ్మయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన కీర్తిప్రియలకు శ్రీచౌడేశ్వరిదేవి కల్యాణ మండలంలో జరిగిన వివాహానికి ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న వెంకటేగౌడ


గృహప్రవేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

శుభాకాంక్షలు


వివాహ వేడుకలో వెంకటేగౌడ

పెద్దపంజాణి: మండలంలోని ముదరంపల్లి, గుండ్లపల్లికి చెందిన నూతన వధూవరులు నాగేంద్ర, హేమావతి, విజయకుమార్, శ్రుతి దంపతులను మాజీ ఎమ్మెల్యే ఎస్. వెంకటేగౌడ గురువారం ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ముత్తుకూరు సర్పంచ్ వెంకటభార్గవ్ ఇంట్లో జరిగిన శుభకార్యంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన దిన్నిపల్లికి చెందిన శ్రీరాములు రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. చివరగా సుద్దగుండ్లపల్లిలో పర్యటించి పార్టీ కార్యకర్తలను అండగా ఉంటామని భరోసా కల్పించారు.

శుభకార్యాల్లో నేతలు

వి.కోట: మండలంలో పలు శుభకార్యాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. మండలంలోని బాలాజీనగర్‌లో లక్ష్మీ వెంకటేశ్వర ఆటో ఫైనాన్స్ నిర్వహిస్తున్న సురేష్ కుమార్, శీకార్లపల్లికి చెందిన నారాయణ గృహ ప్రవేశ కార్యక్రమాలకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరయ్యారు. అలాగే మండలంలోని శీకార్లపల్లి నారాయణ గృహప్రవేశానికి మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. అలాగే పలువురి వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే హాజరై వధూవరులను ఆశ్వీదించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: తాగునీటి సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే వాటిని పరిష్కరించాలని ఎంపీడీఓ బాలాజి ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. క్రాష్ ప్రోగ్రామ్ ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా మంచి నీటి నాణ్యత నిర్వహణ పరీక్షను క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. పైప్‌లైన్ లీకేజీలను వెంటనే పరిష్కరించి వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ విస్తరణ అధికారి శారదాదేవి పాల్గొన్నారు.

కోదండరాముడికి హంస వాహనం


హంస వాహనాన్ని సమర్పిస్తున్న దాతలు

శాంతిపురం: రాళ్లబూదుగూరులోని పురాతన శ్రీ కోదండరామస్వామి వారికి పంచలోహాలతో తయారు చేసిన హంస వాహనాన్ని ఎస్.గొల్లపల్లికి చెందిన భక్తులు గురువారం సమర్పించారు. చిన్నారిదొడ్డి పంచాయతీ సర్పంచ్ రేణుకా బాల సుబ్రమణ్యం కుటుంబసభ్యులు ఆరు అడుగుల ఎత్తైన ఈ వాహనాన్ని తయారు చేయించారు. ఆలయంలో జరిగిన కార్యక్రమంలో పురోహితుడు గోపిస్వామి, ఉత్సవ నిర్వాహకులకు అప్పగించారు. ఈ నెల 8 నుంచి సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా తొలి రోజు ధ్వజారోహణం తర్వాత హంస వాహనంపై స్వామి వారు ఊరేగనున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

పుంగనూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని గూడూరుపల్లికి చెందిన సుబ్రమణ్యం(49) వ్యవసాయ కూలీ. మంగళవారం ద్విచక్రవాహనంపై పుంగనూరుకు వెళుతుండగా పట్టణంలోని తూర్పుమొగశాల వద్ద అదుపుతప్పి బోల్తాపడ్డాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గాయపడిన అతన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

అడవికి నిప్పు


తగలబడుతున్న అటవీ ప్రాంతం

సదుం: కొందరి అవగాహనా లోపంతో అడవులకు నిప్పు పెడుతుండడంతో పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి కావడంతో పాటు అటవీ జంతువుల జీవనానికి ఇబ్బందులు తప్పడం లేదు. జోగివారి పల్లె–చీకలచేను మార్గంలో కనుమలో గంగమ్మ గుడికి సమీపంలో తూర్పువైపున ఉన్న అడవికి గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అడవికి నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పిస్తే ఇలాంటి చర్యలు జరగవని పలువురు తెలిపారు.

మామిడి చెట్లు కాల్చేశారని ఫిర్యాదు

చౌడేపల్లె: మామిడి చెట్లకు నిప్పు పెట్టి కాల్చేశారని గురువారం బత్తలాపురానికి చెందిన చెంగల్రాయప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి సమీపంలో 15 ఏళ్ల క్రితం మామిడి చెట్లు నాటారు. పక్కన పొలం అతను ఉద్దేశపూర్వకంగా చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు తోటకు వ్యాపించాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో పూత దశలో ఉన్న మామిడి చెట్లు కాలిపోయాయని తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

గాయపడిన వ్యక్తికి పరామర్శ

బైరెడ్డిపల్లె: మండలంలోని చీలంపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత రాజారెడ్డి ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం బోల్తాపడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కుటుంబసభ్యులు వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చేర్పించారు. రాజారెడ్డి ఆరోగ్యం మెరుగుపడడంతో స్వగ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె పంచాయతీ పరిధిలోని ఎర్రకదిరేపల్లెలో గురువారం బాటగంగమ్మ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రతిష్టించారు. ఉదయం ఆలయం వద్ద అమ్మవారి శిరస్సుకు ప్రత్యేక పూజలు చేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద విగ్రహాన్ని ప్రతిష్టించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

స్కూలు ఎదుటే మురుగు


ఇబ్బందికరంగా మారిన మురుగు కాలువ

శాంతిపురం: అనికెర క్రాసులోని శెట్టిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట మురుగు నీటి గుంట విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు స్థానికులకు శాపంగా మారింది. ఇక్కడ మురుగు కాలువ లేదని రెండు నెలల క్రితం ఇక్కడికి వచ్చిన కడ పీడీ దృష్టికి స్థానికులు తెచ్చారు. దీనిపై స్పందించిన పీడీ ఆదేశాలతో ఎంపీడీఓ తక్షణం పనులకు పురమాయించినట్టు స్థానికులు చెప్పారు. దీంతో రెండు రోజుల్లోనే స్థానిక అధికార పార్టీ నాయకులు జేసీబీతో మట్టి కాలువ తవ్వేశారు. పాఠశాలకు వెళ్లేందుకు ఇరుకుగా ఉన్న చిన్నపాటి పైపును ఏర్పాటు చేశారు. కానీ తర్వాత సమస్యను పట్టించుకునేవారు లేకపోయారు. దీంతో మట్టి కాలువలో మురుగునీరు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ దుర్వాసనలోనే ఉపాధ్యాయులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. పొరుగున ఉంటున్న కుటుంబాలకు ఇబ్బంది తప్పడం లేదు. అధికారులు స్పందించి త్వరగా మురుగు కాలువను నిర్మించాలని వారు కోరుతున్నారు.

లోక్ అదాలత్ రేపు


మాట్లాడుతున్న జడ్జి ఆదినారాయణ

పలమనేరు: ఈనెల 8న స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని దీన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సివిల్ జడ్జి ఆదినారాయణ సూచించారు. ఆమేరకు స్థానిక కోర్టులో గురువారం ఆయన న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించి ఎక్కువ కేసులు రాజీ జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ కేసుల రాజీకి ఇదే చక్కటి మార్గమని కేసులను రాజీ చేసుకొని ప్రశాంత జీవితాన్ని గడపాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీపతి, న్యావాదులు పాల్గొన్నారు.

చికెన్ సెంటర్ల తనిఖీ

పలమనేరు: పట్టణంలోని పలు చికెన్ దుకాణాల్లో మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. చికెన్‌కు ఫుడ్ కలర్స్ వేసి విక్రయిస్తున్న వారి నుంచి రూ.4.500 జరిమానా వసూలు చేసినట్టు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. కలర్స్ వాడుతుంటే తమ దృష్టికి తేవాలని పేర్కొన్నారు.

విద్యా సామగ్రి వితరణ


విద్యాసామగ్రి తీసుకున్న విద్యార్థులతో దాతలు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు హైస్కూల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే 147 మంది విద్యార్థులకు గురువారం కల్లూరుకు చెందిన ముస్లిం నవ జవాన్ సొసైటీ అధ్యక్షుడు అల్తాఫ్, సంఘ సభ్యులు విద్యాసామగ్రిని ఉచితంగా అందజేశారు. రూ.13వేల విలువ చేసే ప్యాడ్లు, స్కేల్లు, పెన్సిళ్లు, ఎరేజర్లు అందజేసినట్లు హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటసిద్దులు, రాజేంద్ర, మహ్మద్‌రఫీ, నవాబ్‌జాన్, రహమత్ బాషా, హయత్ బాషా పాల్గొన్నారు.

రైతు సమక్షంలోనే సర్వే చేయాలి


రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ భవాని

చౌడేపల్లె: రైతు సమక్షంలోనే వ్యవసాయ భూములను రీసర్వే చేయాలని పలమనేరు ఆర్డీఓ భవాని ఆదేశించారు. గురువారం లద్దిగంలో రీసర్వేను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి పొలాల్లో అధికారులు సర్వే చేయాలన్నారు. లద్దిగం రెవెన్యూ పరిధిలోని ప్రాంతాల్లో తొలిదశగా రీసర్వే చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతునాయక్, సర్వేయర్ గుణశేఖర్ పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ

పెద్దపంజాణి: సారా తయారు చేసి రవాణా చేయడం, అమ్మడం చట్టరీత్యా నేరమని పుంగనూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. గురువారం పెద్దపంజాణి ఎస్ఐ సహదేవి, తహసీల్దార్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నవోదయం–2 కార్యక్రమంలో భాగంగా రాయలపేట పంచాయతీ గంకొండ గ్రామంలో సారా నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సారా వలన కలిగే అనర్థాలను అధికారులు వివరించారు. సారా విక్రేతలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ మునిరాజ, వీఆర్వో రాజన్న, హెచ్‌ఎం.ఇందిర పాల్గొన్నారు.

హైస్కూల్‌లో సరస్వతీ దేవి విగ్రహం


విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓలు, దాతలు

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లులోని హైస్కూల్‌లో సరస్వతీదేవి విగ్రహాన్ని గురువారం దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి ప్రారంభించారు. దాతలు సుబ్రమణ్యంరాజు, భక్తవత్సలరాజు, రామకృష్ణంరాజు, భాస్కర్‌రాజు, జ్యోతిరాజు, దేశాదిప్రకాష్ కలసి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆలయాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ మోహన్‌రాజు, హెచ్‌ఎం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

శాంతిపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం సందర్శించారు. అందుబాటులోని గదులను పరిశీలించి, వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్యసేవల బలోపేతం కోసం టాటా గ్రూప్ ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించనున్న డీఐఎస్సీ కార్యక్రమానికి పీహెచ్‌సీలో ఓ గదిని కేటాయించాలని ఆదేశించి వెళ్లారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో వచ్చే జూన్ నుంచి పని చేయనున్న డేటా సెంటర్‌కు అనుబంధంగా పీహెచ్‌సీలలో సమాచార సేకరణ, విశ్లేషణ కేంద్రాలు ఉంటాయని డాక్టర్ వంశీకృష్ణ చెప్పారు. జిల్లా కలెక్టర్ వెంట కడ పీడీ వికాస్ మర్మత్ ఉన్నారు.

వేలాడుతున్న మృత్యు తీగలు

- చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు
- ఆదమరిస్తే అంతే


చేతికి తాకినట్టుగా విద్యుత్ తీగలను చూపుతున్న వ్యక్తి

గంగవరం: విద్యుత్ స్తంభానికి అమర్చిన కరెంటు తీగలను చేతికందనంత ఎత్తులో వేలాడుతుండడం మనం చూసుంటాం. అయితే ఆ గ్రామంలో మాత్రం కరెంటు తీగలు చేతికందేంత ఎత్తులోనే వేలాడుతే మృత్యుతీగలుగా భయపెడుతున్నాయి. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కేసీ.పెంట గ్రామంలోని ఓ వీధిలో ఇళ్ల ముందు విద్యుత్ స్తంభానికి అమర్చిన కరెంటు తీగలు చేతికందే అంత ఎత్తులోనే వేలాడుతున్నాయి. గ్రామస్తులు బయటకు రావాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వస్తున్నారు. ఈ విషయం గురించి స్థానిక సర్పంచ్ గిరిరాజారెడ్డి పలుమార్లు విద్యుత్ సిబ్బందికి విన్నవించినా వారిలో స్పందన లేకపోయింది. ప్రమాదం జరిగే వరకు విద్యుత్ అధికారులు పట్టించుకోరా అని మండిపడుతున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు వేకువజామున స్వామివారి మూలవిరాట్‌కు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధిచేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం పెద్దశేషవాహనం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు తెలిపారు.


విద్యుద్దీపాలతో ఆలయం